సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం | 24 | ఆగస్టు | 2025



ఉత్సాహంగా యోగా పోటీలు

ప్రత్తిపాడులో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మూడో రోజు వ్యక్తిగత, జంట పోటీలు నిర్వహించారు.

8లో ▸



ఇప్పుడు నిషేధమంటే ఎలా?

చవితి ఉత్సవాల్లో పీఓపీ విగ్రహాలను నిషేధించాలంటూ కలెక్టర్ ప్రకటనతో తయారీదారుల్లో ఆందోళన నెలకొంది.

8లో ▸



చెక్ పవర్ రద్దుపై హైకోర్టు స్టే

కుట్రతో రద్దు చేయించిన చెక్ పవర్ రద్దును నిలిపివేస్తూ హైకోర్టు స్టే విధించిందని పండిత విల్లూరు సర్పంచ్ తెలిపారు.

8లో ▸

న్యూస్‌రీల్

క్షీరారామంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



న్యాయమూర్తికి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్, వసంత లక్ష్మి దంపతులు సందర్శించారు. శనివారం మధ్యాహ్నం ఆలయానికి విచ్చేసిన జడ్జి కృష్ణమోహన్ దంపతులకు ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు ముందుగా గణపతి పూజ చేసి అనంతరం క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్దనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస రావు వారిని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటాన్ని అందజేశారు. పట్టణ జడ్జి షేక్ జియావుద్దీన్, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, సీఐ రజనీకుమార్, ఆలయ సూపరింటెండెంట్ పసుపులేటి వాసు ఉన్నారు. పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత టంగుటూరి



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం, పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో టంగుటూరి జయంతి కార్యక్రమం నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి కలెక్టర్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం టంగుటూరి కృషి మరువలేమని కలెక్టర్ అన్నారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోగుల నుంచి ఎలాంటి వసూళ్లకూ పాల్పడలేదు



మాట్లాడుతున్న డాక్టర్ వర్మ

భీమవరం(ప్రకాశం చౌక్): ఆరోగ్యశ్రీ సేవల కోసం రోగుల నుంచి ఎలాంటి వసూళ్లు చేయలేదని భీమవరం వర్మ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పీఆర్‌కే వర్మ తెలిపారు. శనివారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్‌లో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి ఇద్దరు ప్యానెల్ డాక్టర్లు వచ్చి ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి తాము ఎలాంటి వసూళ్లకు పాల్పడలేదని నిర్ధారించారన్నారు. అయినా ఈనెల 21న సాయంత్రం నుంచి తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్టు సమాచారం వచ్చిందన్నారు. ఓ డెలివరీ కేసుకు సంబంధించి రెండు కోడ్‌లు పెట్టడంతో రూ.6 వేలు ఫైన్ వేశారని, నిబంధనల ప్రకారం రూ.60 వేలు డీడీ తీసి సోమవారం ట్రస్ట్‌కు అందించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఆస్పత్రిలో 175 మంది పాత రోగులకు డయాలసిస్ సేవలు కొనసాగుతున్నాయన్నారు.

హామీల అమలు కోసం పోరాటం



ఉత్తరాల ప్రదర్శనలో భవన నిర్మాణ కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని పట్టణ భవన నిర్మాణం కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. కోశాధికారి కోడే సాయి బాలాజీ, నాయకులు రామిశెట్టి శ్రీను, గాది తాతముని, రామిశెట్టి నాగు ఆధ్వర్యంలో సంక్షేమ బోర్డుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ఉత్తరాలు రాశారు. అనంతరం నిరసన ప్రదర్శన నిర్వహించారు. గొల్లగూడెం సెంటర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్స్ పరిష్కరించాలన్నారు. సంక్షేమ బోర్డు హక్కులను అమలు చేసేలా చూడాలని, వృద్ధ కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని, అర్హులైన లబ్ధిదారులు అప్లికేషన్లు తీసుకునేలా అధికారులు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కడకట్ల, కొండయ్య చెరువు, హౌసింగ్‌బోర్డు, గొల్లగూడెంనకు చెందిన కార్మికులు హాజరయ్యారు.

ఉసూరుమని పింఛెన్

- కొత్త పింఛన్లకు 'చంద్ర' గ్రహణం
- పెండింగ్‌లో 28వేలకు పైగా దరఖాస్తులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికి..
- ఆయా సామాజిక వర్గాలకు చెందిన 2.5 లక్షల మంది ఎదురుచూపు
- అర్హత ఉన్నా సాయం అందక నష్టపోతున్న పేదలు
- ఏడాదిన్నరలో ఒక్క కొత్త పింఛన్ ఇవ్వని కూటమి సర్కారు

సాక్షి, భీమవరం: కొత్త పింఛన్లు ఎప్పుడు వస్తాయో తెలియదు. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్ హామీ ఊసే లేదు. అర్హత ఉన్నా సాయం అందక వేలాది మంది నష్టపోతున్నా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. ఏడాదిన్నర కాలంలో కొత్త మంజూరు ఏమీ లేకపోయినా ప్రతి నెలా పింఛన్ల పేరిట కూటమి నేతలు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు.

కార్యాలయాల చుట్టూ తిరుగుతూ..

50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామంటూ ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, కూటమి నేతలు ఊరూరా ఊదరగొట్టారు. పాలన చేపట్టి ఏడాదిన్నర దాటినా ఇంకా ఆ ఊసే ఎత్తడం లేదు. జిల్లాలో 50 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రెండున్నర లక్షల మంది వరకు ఉండగా వారిలో 80 శాతం మంది అర్హులుంటారని అంచనా. ఎన్నికల హామీ అమలు కోసం ఆయావర్గాల వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కొత్త పింఛన్ల ఊసే ఎత్తకపోవడం వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. పింఛన్ సాయం కోరుతూ సచివాయాలు, ఎంపీడీఓ కార్యాలయాలకు వెళుతుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని చెబుతున్నారని వారు వాపోతున్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడు వస్తాయో తెలియదు. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్ హామీ ఊసే లేదు. అర్హత ఉన్నా సాయం అందక వేలాది మంది నష్టపోతున్నా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. ఏడాదిన్నర కాలంలో కొత్త మంజూరు ఏమీ లేకపోయినా ప్రతి నెలా పింఛన్ల పేరిట కూటమి నేతలు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు.



వైఎస్సార్‌సీపీ హయాంలో.. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఏటా జనవరి, జూలై నెలల్లో అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు సిబ్బంది వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. రాజకీయాలు, కులమత వర్గాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరిగేది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేనాటికి జిల్లాలో సామాజిక పింఛన్లు దాదాపు 1.32 లక్షల వరకు ఉండగా ఐదేళ్లలో వాటి సంఖ్య 2,32,885 పెరగడం గమనార్హం. ఎన్నికలకు ముందు గత జనవరిలోనూ జిల్లాలో 4,274 కొత్త పింఛన్లు మంజూరు చేశారు.

పెండింగ్‌లో వేల దరఖాస్తులు

జిల్లావ్యాప్తంగా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో పేదలు దరఖాస్తు చేసుకుంటున్నారు. గత ఏడాదిన్నర కాలంలో జిల్లావ్యాప్తంగా 28 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు అంచనా. వీరంతా సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా ప్రభుత్వం ఇంకా కొత్త శాంక్షన్ ఇవ్వలేదని ఉద్యోగులు వారిని వెనక్కి పంపిస్తున్నారు. తమకు అర్హత ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యం వలన పింఛన్ సాయం అందక నష్టపోతున్నామని పేదవర్గాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తవి ఇవ్వకపోగా ఉన్నవాటికి కోత పెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నాటికి జిల్లాలో 2,32,885 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 2,26,995 చేరింది. ఈ మేరకు 5,890 పింఛన్లు తగ్గాయి. తాజాగా దివ్యాంగుల పింఛన్లకు కోతపెట్టే పనిలో ప్రభుత్వం ఉండటం గమనార్హం.

కూటమి ప్రభుత్వం దగా



దళితులు, బడుగు, బల**హీన, మైనార్టీ** వర్గాలకు **50 ఏళ్లకే** పెన్షన్ హామీని **కూటమి ప్రభు**త్వం అమలు **చేయకుండా** మోసం **చేస్తోంది.** సూపర్ 6 పథకాల్లో కూడా నిరు**ద్యోగ భృతి,** మహిళలకు నెలకు రూ.1,500 **ఇస్తామని** ఇంకా అమలు చేయలేదు. ఇచ్చిన **హామీలను** అరకొరగా అమలు చేస్తూ ప్రజ**లను మోసం** చేయడం సమంజసం కాదు.

– షేక్ చాన్ బీబీ, పాలకొల్లు

హామీలు అమలు చేయాలి



50 ఏళ్ల వయసు దాటిన వారికి పింఛన్ ఇస్తానని ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం మోసపూరితం. ఎన్నో ఆశలతో ఓట్లు వేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ మంజూరు చేయాలి.

– కొరపాటి అనిత, గృహిణి, చెరుకువాడ

కూటమి నేతల హడావుడి

కొత్త పథకాలు ప్రవేశపెట్టే సమయంలో ప్రజాప్రతినిధులు, అధికార పక్షం నేతలు హాజరై వాటిని లాంఛనంగా ప్రారంభించడం పరిపాటి. తర్వాత నుంచి యథా ప్రకారం ఆ కార్యక్రమం సాగిపోతుంటుంది. కాగా కూటమి తీరు ఇందుకు భిన్నంగా ఉంది. సూపర్ సిక్స్ హామీల అమలులో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రతినెలా పింఛన్ల పంపిణీని ఆర్భాటంగా నిర్వహిస్తున్నారు. సచివాలయ సిబ్బంది వెంట కూటమి నేతలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సాయం అందిస్తుండటం చూసి జనం ముక్కన వేలేసుకుంటున్నారు.

యూరియా సరఫరాలో విఫలం



వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో రైతులకు యూరియాను సరఫరా చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాంనాయుడు అన్నారు. శనివారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్నింటా అండగా నిలిచిందన్నారు. సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందించడంతో పాటు ఆర్‌బీకేలతో భరోసా కల్పించిందన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని, నీరు నిలిచిన మెట్ట పంటలకు, ముంపునకు గురైన మాగాణి పొలాలకు యూరియాను వెంటనే వాడాల్సి ఉందని, పదును దాటిన తర్వాత వాడినా ఉపయోగం ఉండదన్నారు. ఈ కారణంతో యూరియా వాడకం పెరిగినా తగిన స్థాయిలో అందుబాటులో లేదన్నారు. యూరియా నిల్వలపై వ్యవసాయ శాఖ చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయి స్థితికి సంబంధం లేదన్నారు. శాస్త్రీయంగా నిరూపణ కాని నానో యూరియా డబ్బాను రైతులతో బలవంతంగా కొనిపిస్తున్నారన్నారు. సెప్టెంబరు మొదటి వారం తర్వాత కానీ యూరియా రాష్ట్రానికి రాని పరిస్థితులు ఉన్నాయని, వెంటనే యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు.

నరసాపురంలో ఉగ్ర గోదావరి



నరసాపురంలో నిండుగా ప్రవహిస్తున్న వశిష్ట గోదావరి

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి ఉధృతి కొనసాగుతోంది. శనివారం కొంతమేర నీటిమట్టం తగ్గినా వలంధర్‌రేవు, లలితాంబఘాట్, పడవల రేవు వద్ద పరిస్థితి ప్రమాదకరంగానే ఉంది. రేవులన్నీ నీటమునిగే ఉన్నాయి. బాపూ ఘాట్ వద్ద నీటిమట్టం తగ్గలేదు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వచ్చి చేరుతున్న వరద నీరు అంతే వేగంతో సముద్రంలోకి వెళుతోంది. మాధవాయిపాలెం ఫెర్రీ వద్ద పంటు రాకపోకలు పునరుద్ధరించలేదు. మరో రెండు మూడు రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా.

గూడెం.. గుంతలమయం




తాడేపల్లిగూడెంలోని బైపాస్ రోడ్డు ప్రారంభంలో భారీ గొయ్యి



అధ్వానంగా మారిన మసీద్ రోడ్డు

- అధ్వానంగా రోడ్లు
- వర్షాలతో మరింత ఛిద్రం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో రోడ్లు ఛిద్రమై ప్రయాణికులను భయపెడుతున్నాయి. పట్టణంలోని కేఎన్ రోడ్డులో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై, ఎస్‌టీఆర్ జంక్షన్ నుంచి తాలూకా సెంటర్ మార్గంలో, బస్సు కాంప్లెక్స్, గొల్లగూడెం సెంటర్, ఎస్‌వీఆర్ సర్కిల్ సెంటర్, మాగంటి కళ్యాణ మండపం,ఏలూరు వైపు యాగర్లపల్లి, పడాల మార్గంలో, రెండో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై, తణుకు వైపు జువ్వలపాలెం మార్గంలో రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. దీంతో ఇటుగా ప్రయాణించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఛిద్రంగా మారిన రోడ్లు వర్షాల దెబ్బకు మరింత దారుణంగా తయారయ్యాయి. గోతుల్లో వర్షం నీరు నిండి, చిన్నపాటి మరమ్మతులు, ప్యాచ్ వర్కులు చేసిన చోట్ల రాళ్లు, రప్పలు పైకి లేచి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి 16 నెలలు కావస్తున్నా పట్టణంలో ప్రధాన రహదారులకు పూర్తిస్థాయిలో మోక్షం కలగలేదు. కొన్ని రోడ్లను నామమాత్రపు మరమ్మతులు, ప్యాచ్ వర్కులతో సరిపెట్టారు. అలాగే పట్టణంలోని 35 వార్డుల్లో అంతర్గత రహదారులు కూడా పూర్తిగా పాడయ్యాయి. పట్టణం విద్యా, వాణిజ్య కేంద్రం కావడంతో స్కూల్ బస్సులు, సరుకు రవాణా, ఇతర వాహనాల రాకపోకలు అధికం. గోతులతో ప్రమాదాల బారిన పడటంతో పాటు ఒళ్లు హూనం అవుతుందని, వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



తణుకు బస్టాప్ ఎదురుగా రోడ్డు

కనీసం గుంతలు పూడ్చండి




పట్టణంలో అన్ని ప్రధాన, అంతర్గత రోడ్లు గుంతలతో నిండిపోయాయి. బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కనీసం గుంతలనైనా పూడ్చించాలి. లేకపోతే శాశ్వత ప్రాతిపదికన పునర్నిర్మించాలి.

– కె.సుబ్బారావు, తాడేపల్లిగూడెం



ఏలూరు అమీనాపేట పోలీస్‌స్టేషన్ వద్ద కైండ్‌నెస్ వాల్ అల్మారా



బొమ్మలను తిలకిస్తున్న బాలిక

సేవాతత్పరత.. సామాజిక బాధ్యత

'నా' అనే స్వార్థాన్ని విడిచి.. 'మన' అనే దృక్పథాన్ని పెంచేలా ఏలూరు పోలీసులు సేవాతత్పరత చాటుతూ 'మోడల్ పోలీస్'గా నిలుస్తున్నారు. మానవత్వ స్ఫూర్తిని పెంపొందిస్తూ సామాజిక బాధ్యతపై అవగాహన పెంచేలా వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. సమాజంలో అభాగ్యులకు ఆపన్నహస్తం అందించేలా జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ కైండ్‌నెస్ వాల్, టేక్ ఏ బుక్.. లీవ్ ఏ బుక్ కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- ఏలూరులో 'మోడల్' పోలీస్
- కైండ్‌నెస్ వాల్, టేక్ ఏ బుక్ కార్యక్రమాలు
- పోలీసుల ఆధ్వర్యంలో పర్యవేక్షణ

సండే స్పెషల్

ఏలూరు టౌన్ : ఓ వైపు చట్టానికి లోబడి శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు మరోవైపు సామాజిక బాధ్యతగా ఏలూరు అమీనాపేట పోలీస్ పెట్రోల్‌స్టేషన్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన కైండ్‌నెస్ వాల్ మన్ననలు పొందుతోంది. ఇంట్లో మనం ఉపయోగించని వస్తువులు చాలా ఉంటాయి. సమాజంలో ఆ వస్తువులు అవసరమైన వారూ ఉంటారు. అయితే వాటిని వారికి ఎలా అందించాలో చాలా మందికి తెలియదు. సాయం చేయాలన్న ఆలోచన ఉన్నా మార్గం లేక వదిలేస్తారు. అలాంటి వారు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆయా వస్తువులను పోలీసులు ఏర్పాటుచేసిన కైండ్‌నెస్ వాల్ అల్మారాలో పెట్టవచ్చు. వాటిని అవసరమైన వారు తీసుకుని వినియోగిస్తారు. ఈ విధానంలో డిగ్నిటీ.. కైండ్‌నెస్.. కేరింగ్.. ఒక్కచోటే ఉంటాయి. ఈ ఆలోచనలతో పోలీసులు ఏర్పాటు చేసిన కైండ్‌నెస్ వాల్ మన్ననలు పొందుతోంది. పలువురు దుస్తులు, ఆటబొమ్మలు, షూష్, చెప్పులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఇలా పలురకాల వస్తువులను ఇక్కడ ఉంచుతున్నారు. వీటిని పిల్లలు, పెద్దలు, కార్మికులు వచ్చి ఆనందంగా తీసుకువెళుతున్నారు. కైండ్‌నెస్ బాస్కెట్స్ పేరుతో ఇదే విధానం పలు దేశాల్లో మన్ననలు పొందింది.



టేక్ ఏ బుక్‌కు మంచి ఆదరణ

ఏలూరు ఎస్పీ క్యాంపు కార్యాలయం బయట రోడ్డుపైనా, ట్రాఫిక్ పార్కులో టేక్ ఏ బుక్.. లీవ్ ఏ బుక్ అనే నూతన విధానాన్ని ప్రారంభించారు. జిల్లా జేసీ ధాత్రిరెడ్డి ఆలోచనతో వీటిని ఏర్పాటుచేశారు. పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభమైన సమయంలో మంచి స్పందన వస్తోంది. చాలామంది విద్యార్థులు పుస్తకాలు ఈ ర్యాక్‌లో పెడితే, అవసరమైన వారు తీసుకుంటున్నారు. ఇప్పటికీ విద్యార్థులు అల్మారాలోని విలువైన పుస్తకాలు తీసుకుని చదివి, వారి వద్ద ఉన్న పుస్తకాలను అక్కడ పెడుతున్నారు. ఈ పుస్తకాల ర్యాక్‌కు విద్యార్థులు, లెక్చరర్స్, ఉపాధ్యాయుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

డిగ్నిటీ ఆఫ్ కైండ్‌నెస్ పెంపొందించేలా..



పిల్లలకు చిన్నతనం నుంచే సామాజిక పరిస్థితులపై అవగాహన, బాధ్యత పెంచాలి. ఇదంతా ఇంటి నుంచి ప్రారంభించాలి. దానం చేశామనే ఫీలింగ్ మనలో ఉండకుండా, తీసుకున్నామనే ఆలోచన మనసును బాధించకుండా డిగ్నిటీ ఆఫ్ కైండ్‌నెస్ ప్రతి ఒక్కరిలో పెంపొందించాలి. కరుణ, దయాగుణం పిల్లల్లో అలవర్చుతూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చూడాలి. దీంతో కక్షలు, ద్వేషాలు, కోపాలు, దాడులు, దౌర్జన్యాలు నిరోధించే అవకాశం ఏర్పడుతుంది.

– కొమ్మి ప్రతాప్ శివకిషోర్, ఏలూరు జిల్లా ఎస్పీ

క్లుప్తంగా

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి సుజాతకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

మద్ది అంజన్న సేవలో..

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామికి అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామి ఉత్సవమూర్తికి అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. మద్ది అంజన్నను హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో, అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజ ఏర్పాట్లు చేశారు. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటలకు హనుమద్ హోమం నిర్వహిస్తున్నట్లు, ఈవో తెలిపారు. గన్నవరానికి చెందిన పాలడుగు సత్యసాయి కుమార్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు విరాళంగా అందజేసినట్లు తెలిపారు.

ఇప్పుడు నిషేధమంటే ఎలా?

- పీఓపీ విగ్రహాల తయారీదారుల ఆందోళన
- రూ.లక్షల పెట్టుబడితో పెద్ద సంఖ్యలో విగ్రహాల తయారీ
- ఇప్పుడు కలెక్టర్ ప్రకటనతో ఆందోళనలో తయారీదారులు



విస్సాకోడేరులో అమ్మకానికి సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు



వివిధ రంగులు, ఆకారాల్లో వినాయక విగ్రహాలు

భీమవరం : వినాయక చవితి ఉత్సవాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ)తో తయారుచేసిన విగ్రహాలను నిషేధించాలంటూ కలెక్టర్ చేసిన ప్రకటనతో విగ్రహాల తయారీదారుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే వందలాది విగ్రహాలను తయారుచేసి అమ్మకాలకు సిద్ధం చేసిన సమయంలో కలెక్టర్ ప్రకటన తమ పొట్టకొట్టేలా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు సంప్రదాయ ఉత్సవాల్లో వినాయక చవితికి అత్యంత ప్రాధాన్యత ఉంది. చవితి పండుగకు ఏడెనిమిది నెలల ముందు నుంచే అనేక ప్రాంతాల్లో విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. దీనికిగాను లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. విగ్రహాలు అమ్మి చేసిన అప్పులు తీర్చుకుని మిగిలిన కాస్తో కూస్తో సొమ్ములతో జీవించాలని ఆశతో ఎదురుచూస్తున్న విగ్రహాల తయారీదారులకు పీఓపీ విగ్రహాల అమ్మకాలు నిలిచిపోతే తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి విగ్రహాల తయారీ కష్టం కావడంతో పాటు పీఓపీ విగ్రహాల పట్ల మోజు పెరగడంతో కొన్ని ఉత్సవ కమిటీలు పోటీలు పడి పెద్ద పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేసి భారీ స్థాయిలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంతో వినాయక విగ్రహాల తయారుదారులు సైతం వివిధ రకాల సైజులు, ఆకారాల్లో ఆకర్షణీయమైన రంగుల్లో విగ్రహాలను తయారుచేస్తున్నారు. దీనికిగాను ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వచ్చే వినాయక చవితికి జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే విగ్రహాల తయారీ ప్రారంభిస్తున్నారు. కొంతమంది పెద్ద మొత్తంలో సొమ్ములు అప్పులు చేసి ప్రత్యేకంగా కార్మికులను పెట్టుకుని విగ్రహాల తయారీ ద్వారా ఉపాధి కల్పించడంతోపాటు జీవనోపాధి పొందుతున్నారు. వర్షాకాలంలో సైతం విగ్రహాలు తడిచిపోకుండా షెల్టర్స్ ఏర్పాటుచేసి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భీమవరం, పాలకొల్లు, పెనుగొండ, సిద్ధాంతం, తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి, ఆకివీడు, విస్సాకోడేరు తదితర ప్రాంతాల్లో పీఓపీ విగ్రహాలు తయారు చేస్తున్నారు. వినాయక విగ్రహాలతోపాటు దసరా సందర్భంగా కనక దుర్గమ్మ విగ్రహాలను తయారుచేసి విక్రయిస్తుంటారు. అయితే పీఓపీ విగ్రహాల నిషేధమని కలెక్టర్ ప్రకటించడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి పర్యావరణ పరిరక్షణ పట్ల చిత్తశుద్ధి ఉంటే పీఓపీ విగ్రహాల తయారీ ప్రారంభ సమయంలోనే అడ్డుకుని ఉంటే తాము ప్రత్యామ్నాయ ఉపాధిని వెదుక్కుని దానిలో స్థిరపడేవాళ్లమని, పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి పెద్ద సంఖ్యలో విగ్రహాలు తయారుచేసిన తరువాత నిషేధం ఏంటంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విగ్రహాల తయారీనే జీవనాధారం



నేను ఏటా వినాయక విగ్రహాల తయారీ ద్వారా జీవనోపాధి పొందడమేగాక మరొక 50 మందికి ఉపాధి కల్పిస్తున్నాను. ఏటా చవితికి దాదాపు ఆరేడు నెలల ముందుగానే విగ్రహాలు తయారుచేస్తాం. ఇప్పటికే మా వద్ద 200 వరకు విగ్రహాలున్నాయి. అప్పులు తెచ్చి దాదాపు రూ.60 లక్షల వరకు పెట్టుబడి పెట్టాం. ఇలాంటి తరుణంలో పీఓపీ విగ్రహాలు నిషేధమంటే మా పరిస్థితి ఏంటి.?

– ఇంటి ప్రసాద్, విగ్రహాల తయారీదారుడు, వరిధనం, పాలకొల్లు మండలం

ముందుగా చెప్పాలి



వినాయక చవితి, దసరా ఉత్సవాలకు విగ్రహాలను తయారుచేయడం ద్వారా ఉపాధి పొందుతున్నాం. విగ్రహాల తయారీపై ఆధారపడి జీవిస్తున్నాం. గతంలో మట్టి విగ్రహాలు తయారుచేసినా నేడు పీఓపీ విగ్రహాలకు ఆదరణ పెరగడంతో వాటిని తయారుచేస్తున్నాం. ఫిబ్రవరి నెలలోనే విగ్రహాల తయారీ ప్రారంభించాం. ఇప్పుడు పీఓపీ విగ్రహాలు నిషేధం అంటూ ప్రకటనలు చేయడం ఎంతవరకు న్యాయం.

– కె మల్లిఖార్జునరావు, విగ్రహాల తయారీదారుడు, పూలపల్లి

ఎరువుల షాపులపై దాడులు



ములగలంపాడులో ఎరువులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు

లింగపాలెం : లింగపాలెం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్, వ్యవసాయ, రెవిన్యూ శాఖల అధికారులు ఎరువుల షాపులపై దాడులు నిర్వహించారు. ములగలంపాడులోని శ్రీవిజయదుర్గా ట్రేడర్స్‌లో దాడులు నిర్వహించగా ఎరువులు తేడా వచ్చిట్లు అధికారులు తెలిపారు. ఈ తేడాలకు సంబంధించి రూ.5.80 లక్షల ఎరువులను సీజ్ చేసి కేసునమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎరువుల విక్రయాలు పారదర్శికంగా నిర్వహించాలని షాపుల యజమానులకు అధికారులు సూచించారు. అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు.

ఎక్సలెన్స్ అవార్డులకు పాఠశాలలు ఎంపిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన, పాఠశాలలకు అందించే స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులకు జిల్లాలోని 5 పాఠశాలలు ఎంపికయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి స్థానంలో పెదవేగి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ద్వితీయ స్థానంలో ఏలూరు సెయింట్ థెరిసా బాలికల ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో ఏలూరులోని ఏఆర్‌డీజీకే నగరపాలక ఉన్నత పాఠశాల ఉన్నాయన్నారు. 4వ స్థానంలో వట్లూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, 5వ స్థానంలో కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నాయన్నారు.

చెక్ పవర్ రద్దుపై హైకోర్టు స్టే



హైకోర్టు స్టే నకలును డీపీవోకి అందిస్తున్న జెడ్పీటీసీ పెద్దిరాజు, సర్పంచ్ చంద్రికలు

పెనుగొండ: కుట్రతో రద్దు చేయించిన చెక్ పవర్ రద్దును నిలిపి వేస్తూ హైకోర్టు స్టే విధించిందని పోడూరు మండలం పండిత విల్లూరు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక తెలిపారు. శనివారం హైకోర్టు ఉత్తర్వులను కలెక్టరు చదలవాడ నాగరాణి, డీపీఓ రామ్‌నాథ్‌రెడ్డిలకు పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఆచంట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, వైఎస్సార్‌సీపీ నాయకుడు గెద్దాడ ఏకలవ్యలతో కలిసి అందించినట్లు తెలిపారు. ఈ పోరాటానికి సహకరించిన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పత్రాలను చూపుతున్న రైతు సత్య సతీష్

ఏలూరు (టూటౌన్) : తన పొలం చుట్టూ సిమ్మెంట్ దిమ్మలతో ఫెన్సింగ్ వేస్తే ఇటీవల కొన్ని దిమ్మెలు అపహరణకు గురయ్యాయని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన కామిరెడ్డి వీర వెంకట సత్య సతీష్ శనివారం కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. శ్రీరామవరంలో తన పొలం అన్యాక్రాంతం కాకూడదని పొలం చుట్టూ సిమెంట్ దిమ్మెలతో ఫెన్సింగ్ వేసినట్లు తెలిపారు. ఆ సిమెంట్ దిమ్మెలు వేరే వ్యక్తి పొలంలో దర్శనమిచ్చాయని దీనిపై దెందులూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినందుకు కొందరు తనను బెదిరించి కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు.

వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి

పోలవరం రూరల్: శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్, వర్కర్స్ వేతన బకాయిలు తక్షణమే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టిసం వద్ద వర్కర్స్ బకాయిల కోసం చేపట్టిన నిరసన కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 నెలల వేతనాలు బకాయిలు ఉంటే కార్మికులు కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు.

డీఎస్సీలో ఫస్ట్ ర్యాంకు



వెలగల రమ్యశ్రీ

పెనుమంట్ర: డీఎస్సీ–2025 పోటీ పరీక్షల్లో పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన వెలగల రమ్యశ్రీ టీజీటీ ఇంగ్లీష్ విభాగంలో 85.43 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో 87.43 మార్కులతో రాష్ట్ర స్థాయి ఎనిమిదో ర్యాంకు, జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది.

కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం: నేర నియంత్రణ, త్వరితగతిన కేసులు పరిష్కారం అనే అంశంపై స్థానిక ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ ఎన్ఫోర్స్‌మెంటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్ దేవ్‌శర్మ సమీక్ష చేశారు. నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి దిశానిర్దేశం చేశారు.

లైంగిక వీడియోలు రికార్డు చేసి.. సోషల్ మీడియాలో పెట్టి..

తాడేపల్లిగూడెం రూరల్ : ఒక మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తి ఆమెతో సన్నిహితంగా ఉన్న సమయంలో వీడియోలు రికార్డు చేసి వాటిని సోషల్ మీడియాలో పెట్టిన ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని పట్టింపాలెంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తొమ్మిదేళ్ల క్రితం భర్త చనిపోయిన ఒక మహిళ, స్థానికుడైన ఆముదాలపల్లి శివశంకర్ గత కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో వారిద్దరూ సన్నిహితంగా ఉన్న సందర్భంలో శివశంకర్ తన ఫోనులో వీడియోలు తీసి ఆమెను బెదిరించేవాడు. ఈ క్రమంలో వారి మధ్య విభేదాలు తలెత్తడంతో విడివిడిగా జీవిస్తున్నారు. నిందితుడు శివశంకర్ నకిలీ ఇన్‌స్టాగామ్ ఐడీని సృష్టించి బాధితురాలి అశ్లీల వీడియోలను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసి వైరల్ చేశాడు. ఈ విషయం తెలిసిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా యోగా పోటీలు



యోగా పోటీల విజేతలతో జిల్లా జడ్జి సికిందర్ బాషా తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు మూడో రోజుకు చేరాయి. శనివారం వ్యక్తిగత, జంట పోటీలు నిర్వహించారు. వ్యక్తిగత విభాగంలో భాగంగా ట్రెడిషనల్ యోగాసన, ఫార్వర్డ్ బెండ్ ఇండివిడ్యువల్, బ్యాక్‌వర్డ్ బెండ్ ఇండివిడ్యువల్, ట్విస్టింగ్ ఇండివిడ్యువల్, ఆర్టిస్టిక్ యోగా విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఐదు విభాగాలలో జరిగిన పోటీలలో మహిళలకు, పురుషులకు వేర్వేరు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 23 జిల్లాల నుంచి యోగా సాధకులు పాల్గొన్నారు. యోగాసనాలలో ప్రతిభ కనబరిచిన 48 మందికి బంగారు, వెండి పతకాలు అందజేశారు. సెషన్స్ కోర్టు న్యాయమూర్తి షేక్ సికిందర్ బాషా చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయి నుంచి దేశ స్థాయికి, అక్కడ నుండి ప్రపంచ స్థాయికి ఎదుగుతున్న యోగాను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక, సహాయ కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి మల్లికార్జునరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్, కాంపిటేషన్ మేనేజర్ కరిబండి రామకృష్ణ, నిర్వహణ డైరెక్టర్ రాఘవేంద్ర, అరా ఫౌండేషన్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు అపర్ణ ప్రసాద్, లయన్ త్రిమూర్తి, బాలగోపాల రామాంజనేయ రాజు, సుభద్ర, ద్వారంపూడి భాను ప్రసాద్, మల్లికార్జున రావు, సుజాత, నున్న నాగేశ్వరరావు, సూరిబాబు, ముత్యాల కృష్ణ, నరసింహరావు, వెంకటేశ్వర్లు, వై.వెంకటేశ్వరరావు, మురళీ కృష్ణ, తిరుపతి రాయి, త్రిమూర్తులు పాల్గొన్నారు.





వివిధ యోగాసనాలు



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు బలరామ్

భీమవరం: కేంద్రం ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి పిలిచిన ప్రైవేటు టెండర్లను తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరాం డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహిస్తున్న పార్టీ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని 35 భాగాలుగా విడదీసి ప్రైవేట్ టెండర్ పిలిస్తే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఫ్యాక్టరీ కార్మికులు అనేక పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, ఇప్పటికే ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉక్కు పరిశ్రమ ప్రైవేటుపరం కాకుండా కాపాడుతామని చెప్పి నేడు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కాపాడే చర్యలు చేపట్టాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని బలరామ్ హెచ్చరించారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ చదివి 35 ఏళ్ల లోపు వున్న షెడ్యూల్డు కులాలకు చెందిన యువతులకు జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.జితేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 8 నెలల నుంచి 10 నెలల వరకు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయములో ఉచిత వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణానంతరం జర్మనీలో నర్సింగ్ ఉద్యోగం కల్పిస్తారన్నారు. ఈ శిక్షణకు జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 8333040217, 9885609777, 9346890335 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఆగిరిపల్లి: తన సోదరుడు కనబడడం లేదని అక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో అక్క ఇంటి వద్ద ఉంటున్న బొక్కినాల నరేష్ ఈనెల 18 నుంచి కనిపించడం లేదు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

ఆకివీడు : స్థానిక యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్ నుంచి కోడల్ని కిందికి నెట్టేసిన టనలో అత్తను అరెస్టు చేసి భీమవరం కోర్టులో హాజరుపరచినట్లు ఏఎస్ఐ సత్యనారాయణ శనివారం చెప్పారు. వెంపటి ఫణి చంద్రశేఖర్, హేమ సింధుజ(సింధు) దంపతులకు 2021లో వివాహమైంది. సింధు భర్త, అత్త సుబ్బలక్ష్మితో అపార్టుమెంట్‌లో నివసిస్తోంది. కొంత కాలంగా వరకట్న వేధింపులకు గురిచేస్తూ, 22న సింధును నెట్టివేయడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. భీమవరం ఆసుపత్రిలో చికిత్స చేయించి, మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించినట్లు ఏఎస్ఐ చెప్పారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త చంద్రశేఖర్, అత్త సుబ్బలక్ష్మిపై హత్యాయత్నం కేసు, వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

సబ్ జైలు సందర్శన



అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: మండల న్యాయసేవాధికారం సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి శనివారం తణుకు సబ్ జైలును సందర్శించారు. రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహార వసతితో పాటు వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని రిమాండ్ ముద్దాయిలకు మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం సేవలు అందిస్తారని, ప్రతిఒక్కరూ న్యాయవాదిని కలిగి ఉండాలని సూచించారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత ప్రతి ఒక్కరూ తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని, చెడు మార్గాన్ని అనుసరించకుండా సమాజంలో గౌరవంగా జీవించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు టి.సత్యనారాయణ రాజు, అజయ్ కుమార్, జైలు సూపరింటెండెంట్ జి. మోహన రావు పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో ఉన్న శ్రీ వరాల వెంకటేశ్వర స్వామివారికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను జరిపారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రాత్రి చేసిన ఊంజల్ సేవ అలరించింది.

తాడేపల్లిగూడెంలో వీధి కుక్కల స్వైర విహారం



పట్టణంలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

తాడేపల్లిగూడెం: పట్టణంలో ఏ వార్డు, ఏ వీధిలో చూసినా భౌ.. భౌ.. అంటూ శునకాల అరుపులతో దద్దరిల్లుతున్నాయి. ఏ శునకాలు ఎప్పుడు వీరవిహారం చేసి ఏ ఉపద్రవాన్ని తీసుకొస్తాయో? అని ప్రజలు భయపడుతున్నారు. కుక్కల స్వైర విహారాన్ని అడ్డుకుంటున్నామని మునిసిపల్ అధికారులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో కార్యరూపంలో కనిపించడంలేదు. దీంతో గుంపులు గుంపులుగా కుక్కలు విహారం చేస్తున్నాయి. వీటిని కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డీఎస్సీలో ప్రతిభ చాటిన వేణుమాధురి



వట్రపు వేణు మాధురి

తాడేపల్లిగూడెం (టీఓసీ): డీఎస్సీ–2025 పరీక్షా ఫలితాల్లో తాడేపల్లిగూడేనికి చెందిన వట్రపు వేణు మాధురి టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటింది. గురుకుల పాఠశాలలకు సంబంధించి మూడు జిల్లాల్లో ఉన్న ఏకైక ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టును ఫస్ట్ ర్యాంక్ సాధించింది. సెకండరీ గ్రేడ్ పరీక్షల్లోనూ జిల్లాలో 17వ ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ పోస్టుకు జిల్లాలో 11వ ర్యాంక్ సాధించింది. వేణుమాధురి తల్లిదండ్రులు వట్రపు మోహన్‌రెడ్డి, శ్రీలక్ష్మి, అక్క అనుచందన కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తుండటం గమనార్హం.

కాజా సుధీర్ కుమార్‌కు డాక్టరేట్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ జ్యోతిష్యుడు, సక్షమ్ దివ్యాంగ సేవా కేంద్రం జిల్లా జాయింట్ సెక్రటరీ, తాడేపల్లిగూడేనికి చెందిన కాజా సుధీర్ కుమార్ శనివారం చెన్నైలో డాక్టరేట్ అందుకున్నారు. శాంతి, మానవత్వం, విద్యారంగంలో నిరంతరం కృషి చేస్తున్న చెన్నైలోని గ్లోబల్ పీస్ హ్యూమన్ యూనివర్సిటీ నుంచి జ్యోతిష్య రంగంలో విశేష సేవలకు గాను డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్‌ను భవిత సెంటర్ ఉపాధ్యాయులు, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో శనివారం అమావాస్య సందర్భంగా అర్చకులు, వేదపండితులు చండీహోమం నిర్వహించారు. 53 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారు. జిల్లా జడ్జి శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే ప్రాపకం కోసమే కొట్టుపై విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రాపకం పొందేందుకు మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణపై విమర్శలు చేయడం కూటమి నాయకులలో కొందరికి సంస్కారం కాదని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. శనివారం మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు అధ్యక్షతన నియోజకవర్గ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కొట్టు సత్యనారాయణ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని గతంలో మీరే పుస్తకంగా ప్రచురించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ నాయకుడు మార్నీడి బాబ్జి గూడెం మార్కెట్‌లో యాపిల్, కమలపండ్ల వ్యాపారాన్ని ఎందుకు మానేశారో? అందరికీ తెలుసన్నారు. కొట్టు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పిన నరిశే సోమేశ్వరరావు ఇప్పుడు అభివృద్ధి ఏమి చేశారని ప్రశ్నించడం అతనికి ఉన్న అవివేకాన్ని వెల్లడిస్తుందన్నారు. మీరందరూ కొట్టు వల్లే రాజకీయ ప్రవేశం చేశారన్న విషయాన్ని మరవద్దని తెలిపారు. గతంలో మంత్రిగా పైడికొండల మాణిక్యాలరావు చేస్తున్న అభివృద్ధికి ఆనాడు మోకాలొడ్డిన వారిపై ఎన్ని ఆరోపణలు చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ నాయకులందరూ కొట్టు సత్యనారాయణ ఒక్కరిపైనే విమర్శలు చేయడాన్ని ఎవరి ప్రసన్నం కోసమో చెప్పాలన్నారు. గతంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కొట్టుకు 36 వేల ఓట్లతో డిపాజిట్లు వచ్చాయని గుర్తు చేశారు. పార్టీ మ్యాన్‌డేట్‌తో పోటీ చేసిన మీకు డిపాజిట్లు కూడా రాని విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని హితవు పలికారు. సమర్థులైన నాయకులపై విమర్శలు చేయడం మానుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తే కూటమి నాయకులకు ప్రజల మన్ననలు పొందుతారని హితవు పలికారు. సమావేశంలో ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు చిటికెన ప్రసాద్, బొద్దాని శ్రీను, గుండుమోగలు సాంబయ్య, చెన్నా జనార్దన్, వట్టి బుజ్జి, బోణం విజయనిర్మల, తాడిపర్తి రజని, వెలిశెట్టి నరేంద్రకుమార్, చామన సూర్యచంద్రరాబు, మోషే, గార్లపాటి వీరకుమార్, బోశం రమణ, లంకా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నూనె మిల్లు తనిఖీ



నూనె తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: పట్టణంలో నూనె తయారీ కేంద్రాన్ని శనివారం మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సిబ్బందితో కలిసి జూబ్లీరోడ్‌లో ఉన్న నూనెతయారీని తనిఖీ చేశారు. అడ్డా ఆగ్రో ఫార్మ్‌లో జర్మనీ టెక్నాలజీ కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ తయారీని పరిశీలించారు. దుకాణం అనుమతి, ట్రేడ్ లైసెన్సులను చూశా రు. ఆన వెంట మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రాజు, టీపీఓ వి.జగదీశ్వరరావు , ఆర్‌ఓ పి.అశోక్‌కుమార్‌లు ఉన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



తణుకులో బహుమతులందుకున్న విద్యార్థులతో డాక్టర్ జనతరాజు

తణుకు అర్బన్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం 153వ జయంత్యుత్సవాలు తణుకు ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం తాళాబత్తుల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు (జనతరాజు), సామాజిక విశ్లేషకులు డీవీవీఎస్ వర్మ, సామాజికవేత్త పేరూరి మురళీకుమార్‌లు ముందుగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు జీవనశైలితోపాటు, ఆయన ధైర్యసాహసాలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం , చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మణిదీప్, ఉపాధ్యాయులు డి.మంగతాయారు, ఎస్‌కే రజియా, వీవీఎల్ఆర్‌కే కుమారి, హేమలత, వై.శ్రీదేవి, ఇ.శ్రీనివాస్, జి.విమలదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వర్షాకాల పరిశుభ్రత ర్యాలీ



స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



వర్షాకాల పరిశుభ్రత ర్యాలీలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం: స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మునిసిపల్ అధికారులు పట్టణంలో వర్షాకాల పరిశుభ్రత ర్యాలీ నిర్వహించారు. 31వ వార్డు ఎలిమెంటరీ స్కూల్ నుంచి ఎస్వీ.రంగారావు విగ్రహం వరకు ర్యాలీ చేశారు. కమిషనర్ ఎం.ఏసుబాబు, తహిసిల్దార్ సునీల్‌కుమార్ మునిసిపల్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంగా జీవించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సుబ్బారావుపేట ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వర్షకాలంలో పాటించాల్సిన పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు చేశారు. ఈ సందర్భంగా స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాల్సిన ఆవశ్యకతను తెలిపారు. వర్షకాలంలో సీజనల్ వ్యాధులు కారణంగా అనారోగ్యం వస్తుందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నవ భారత శక్తి యువతదే





నిట్‌లో కార్పొరేట్ ఫెస్టులో రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి, కార్యక్రమానికి హాజరైన అతిథులు, విద్యార్థులు

నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి

తాడేపల్లిగూడెం: నవ ప్రపంచాన్ని సృష్టించే శక్తి యువతకే సొంతమని ఏపీనిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. ఫోర్జ్ అలుమినస్ ఆధ్వర్యంలో ఏపీ నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా సాగుతున్న కార్పొరేట్ ఫెస్టులో దినేష్ రెడ్డి మాట్లాడారు. ప్రతి విద్యార్థీ జీవితంలో విభిన్న ఆలోచనలు భాగం కావాలన్నారు. సాంకేతికత, నైపుణ్యం కలిస్తే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చన్నారు. మెషీన్ లెర్నింగ్, ఏఐ వంటి విషయాలపై విద్యార్థులు పట్టు సాధిస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. డీన్ స్టూడెంట్స్ వీరేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన భవిష్యత్ కోసం కలలు కని వాటిని నిజం చేసుకోవాలన్నారు. శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికి పరిమితం కాకుండా, సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డ్రోన్ ఎక్స్‌పో కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

సురవరానికి ఘన నివాళి

తణుకు అర్బన్: నిబద్ధత ఉన్న కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి మరణం తీరని లోటని ప్రముఖ సామాజికవేత్త డీవీవీఎస్ వర్మ అన్నారు. తణుకు సురాజ్య భవన్‌లో శనివారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. సామాజిక, రాజకీయ ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించిన విధానం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సుధాకరరెడ్డి చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, సామాజిక ఉద్యమకారిణి సంకు మనోరమ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఐ నేత, మాజీ పార్లమెంట్ సభ్యుడు, సీపీఐ జాతీయ సమితి మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి మృతిపై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మండల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి



ఆకివీడు: సైన్సు అధ్యాపకులను సత్కరిస్తున్న వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం



పాలకోడేరు: జాతీయ అంతరిక్ష దినోత్సవ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: అంతర్జాతీయ స్థాయిలో మన అంతరిక్ష యానం అగ్రస్థానంలోకి దూసుకుపోతుందని భౌతిక, రసాయనిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పీ.పాల్ దివాకర్, డాక్టర్ కే.ఇమానియేల్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. అధ్యాపకులు మాట్లాడుతూ మన మొట్టమొదటి ఉపగ్రహం ఆర్యభట్ట దగ్గర నుంచి నేడు గగనయాన్ వరకూ ఎన్నో అద్భుతాలు సాధించామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల వైపు విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం అతిథి అధ్యాపకులను సత్కరించారు.

వేంద్ర ఉన్నత పాఠశాలలో...

పాలకోడేరు: వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులచే ఏర్పాటు చేయబడిన ఇస్రో చారిత్రక విజయాలు ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రధాన ఉపాధ్యాయులు జి శ్రీనివాస్ ప్రారంభించారు. హిందీ ఉపాధ్యాయులు, జనవిజ్ఞానవేదిక సభ్యులు ఈ ఫణి రాజేష్ మార్గ నిర్దేశంలో విద్యార్థులు చక్కని ఫొటో ప్రదర్శన నిర్వహించి ఇస్రో విజయాలపై వివరించారు. రాకెట్ నమూనాలను ప్రదర్శించారు.

గణపతి ఉత్సవాలపై సమీక్ష



మాట్లాడుతున్న రూరల్ సీఐ రవికుమార్

తాడేపల్లిగూడెం రూరల్: ప్రశాంతమైన వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ సూచించారు. గణపతి ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్ కుమార్ మాట్లాడారు. రూరల్ సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ గణపతి ఉత్సవ నిర్వాహకులు సింగిల్ విండో విధానంలో అనుమతులు తీసుకోవాలన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా చూడాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎం.వెంకటేష్, రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలి

అత్తిలి: నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడం కోసం ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలని డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీకే మల్లికార్జున రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండలస్థాయి అక్షర ఆధార అక్షరాస్యతా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి వలంటీర్ పదిమందిని అక్షరాస్యులుగా చేయాలని కోరారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని వాటి నుంచి బయటపడాలంటే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా కనీస అక్షర పరిజ్ఞానం కలిగి ఉండాలని కోరారు. ఉపాధి హామీ పథకం కూలీలు అక్షరాసులు కావడం ద్వారా వారి భవిష్యత్తు అభివృద్ధి చెందుతుందని అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎం.శ్రీనివాసరావు, అక్షరాస్యత నోడల్ అధికారి సత్యనారాయణ, మండల విద్యాధికారి ఎంపీఎల్ కె ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ బాపూజీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న మోషేనురాజు, అంజిబాబు

భీమవరం: పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలో శనివారం జైత్ర బిజ్ సొల్యూషన్, వెస్ట్ బెర్రీ స్కూల్, శ్రీభగవాన్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వినాయక చవితి పూజలో మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్ బెర్రీ స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్ కుమార్‌వర్మ, శ్రీభగవాన్ ట్రేడర్స్ నడింపల్లి వెంకట రామరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, కోళ్ల నాగేశ్వరరావు, కలిదిండి బంగార్రాజు, శివరామరాజు, కారుమూరి సత్యనారాయణమూర్తి, కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ లక్ష్మి

వీరవాసరం: రాయకుదురు సెక్టార్ నందు చింతలకోటి గరువు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఈసీసీఈ దినోత్సవం నిర్వహించారు. జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ లక్ష్మి, భీమవరం ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు కలిపిస్తున్న సదుపాయాలు, అందిస్తున్న విద్య అంశాలపై వివరించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తల్లులచే హ్యాండ్‌వాష్ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సరోజినీ, సర్పంచ్ దాసరి మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త జానకి, సహాయకురాలు పాల్గొన్నారు. బలుసు గొయ్యపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించారు.

వేంకటేశ్వరునికి ఊంజల్ సేవ

కాళ్ల: కాళ్ల గ్రామంలో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం పోలాంబ అమావాస్య పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి అష్టోత్తర శతనామార్చన, సహస్రదీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో అరుణ్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కూటమి పాలనలో విద్యాబోధనకు సంకెళ్లు

టీచర్స్ ఎమ్మెల్సీ గోపీమూర్తి ఆవేదన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

ఆకివీడు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి విద్యా బోధనకు సంకెళ్లు వేస్తూ అస్తవ్యస్త విధానాలతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మండిపడ్డారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత ప్రప్రథమంగా స్థానిక పీఎల్ఎస్.జెడ్పీస్కూల్ ఉపాధ్యాయుల్ని ఆయన కలిసి మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకే అధికంగా వినియోగిస్తోందని విమర్శించారు. యోగా, కిట్లు పంపిణీ, ఆన్‌లైన్ భారాలు పెరిగిపోయాయన్నారు. విద్యను అందించడంలో వెనకబడిపోతున్నామన్న భావనతో ఉపాధ్యాయులు తీవ్రంగా కృంగిపోతున్నారన్నారు. పరీక్షా విధానంలో అశాస్త్రీయమైన విధానాన్ని ప్రవేశపెట్టారని గోపీ మూర్తి దుయ్యబుట్టారు. విద్యార్థులు జవాబులు రాయడం, పరీక్షా పేపర్లు దిద్దేందుకు మరింత ఇబ్బందికరంగా ఏర్పడనుందన్నారు. అశాస్త్రయమైన పరీక్షావిధానంను తక్షణం రద్దుచేయాలన్నారు. ఉపాధ్యాయులు వన్‌సైడ్‌గా ఓట్లువేశారని చెప్పిన చంద్రబాబు ఏడాదిన్నర గడుస్తున్నా ఒక్క డీఏ కూడా ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్‌సీ, ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు రూరల్ పరిధిలోని తేతలి సబ్ స్టేషన్‌లో లైన్‌ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ డివిజినల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇందిరా నగర్, తేతలి ఇండస్ట్రియల్ ఎస్టేట్, వడ్లూరు, చివటం ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'అర్జున్ చక్రవర్తి' చిత్రబృందం సందడి

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'అర్జున్ చక్రవర్తి' చిత్రబృందం సందడి చేసింది. చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా నటీనటులు విజయ రామరాజు, సిజరోజ్ శనివారం విద్యార్థులతో కలిసి సరదగా గడిపారు. అనంతరం చిత్రనిర్మాత గుబ్బల శ్రీను మాట్లాడుతూ సాధారణ యువకుడు దేశం గర్వించే గొప్ప క్రీడాకారుడిగా ఎలా ఎదిగాడో అర్జున్ చక్రవర్తి చిత్రంలో చూపించినట్లు చెప్పారు. ఈ చిత్రానికి దర్శకుడిగా విక్రాంత రుద్ర, మ్యూజిక్ డైరెక్టర్‌గా విఘ్నాస్ భాస్కరన్ పనిచేయగా, దయానంద రెడ్డి, దుర్గేష్ నటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యావేత్త గుబ్బల తమ్మయ్య, వి చంద్రశేఖర్, కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

వీరవాసరం: నౌడూరులోని కేఎస్ఎన్ఆర్ కాలేజ్ విద్యార్థులు జోనల్ స్థాయి బాక్సింగ్ సెలక్షన్లలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ కేవీడి ప్రసాద్ రెడ్డి శనివారం తెలిపారు. కాకినాడలో జరిగిన జోనల్ స్థాయి బాక్సింగ్ సెలక్షన్లో బి నదియా, వి దేవి గోల్డ్ మెడల్ సాధించగా, ఎస్ భవ్య, ఎన్. అమృతలక్ష్మి, జి పూజిత, కే మోహన్ అంజలిశ్రీ, ఐ.పద్మావతి సిల్వర్ మెడల్ సాధించారని చెప్పారు. బాలుర విభాగంలో కే గణేష్, ఏ.గిరినాగసాయి, బి సత్య ప్రకాష్ సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కోచ్ చిరంజీవి, మాధవిలను ప్రిన్సిపాల్ బి శేషు అభినందించారు.